

ముదినేపల్లిలో భారీ వర్షం


జలమయమైన రోడ్డు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండల కేంద్రమైన ముదినేపల్లిలో మంగళవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. గంటకుపైగా కురిసిన భారీ వర్షంతో గ్రామాల్లోని అంతర్గత రోడ్లు, ఆర్అండ్‌బి రోడ్లపై పెద్దఎత్తున నీరు నిలిచింది. పల్లపు ప్రాంతాల్లో వర్షపు నీరు చేరి ప్రజలు అవస్థలు పడ్డారు. అన్నవరం జగనన్న కాలనీలో నివాసాల చుట్టూ నీరు చేరడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడ్డారు. మండలంలోని పలు గ్రామాల్లో కురిసిన వర్షానికి అంతర్గత రోడ్లు జలమయమయ్యాయి. ముదినేపల్లిలోని మూడో బజార్ పూర్తిగా జలమయమైంది. దీంతో ద్విచక్ర వాహనదారులు, పాదచారులు, నివాసితులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

ప్రభుత్వాలు మారినా కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్, స్కీమ్ వర్కర్ల కష్టాలు మాత్రం తీరడం లేదు. గత ప్రభుత్వ బాటలోనే ప్రస్తుత పాలకులు సైతం జీతాలు సక్రమంగా వేయకపోవడం ఉద్యోగుల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. జీతాల ఆలస్యంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు, స్కీమ్ వర్కర్లు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కాంట్రాక్టు ఉద్యోగుల జీతాల అవస్థలు..!



- పదో తేదీ వరకూ కొనసాగుతున్న ప్రక్రియ
- జీతాల ఆలస్యంతో ఇఎంఐల ఛార్జీల మోత
- 1, 2 తేదీల్లోనే జీతాలు జమ చేయాలంటున్న ఉద్యోగులు
- కాంట్రాక్ట్ లెక్చరర్లు, అంగన్‌వాడీ, ఆశాలు, ఇతర ఉద్యోగులకు జమకాని జీతాలు
- గత ప్రభుత్వ తరహాలోనే నడుస్తున్నారంటూ చర్చ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో విద్య, వైద్యం ఇతర రంగాల్లో పని చేసే కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు దాదాపు ఐదు వేల మంది ఉన్నారు. డిగ్రీ కాంట్రాక్ట్ లెక్చరర్లు వందల సంఖ్యలో ఉన్నారు. అంగన్‌వాడీలు రెండు జిల్లాల్లో ఏడు వేల మందికిపైగా పని చేస్తున్నారు. ఆశా వర్కర్లు, మధ్యాహ్న భోజన కార్మికులు వేలాదిమంది విధులు నిర్వహిస్తున్నారు. వీరందరికీ ప్రభుత్వం జీతాలు సకాలంలో జమ చేయని పరిస్థితి కొనసాగుతోంది. గత ప్రభుత్వం ఉద్యోగులకు జీతాలు సకాలంలో ఇవ్వడంలో విఫలమైంది. దీంతో ఉద్యోగుల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. 2024 ఎన్నికల్లో వైసిపికి వ్యతిరేకంగా ఉద్యోగులంతా ఓట్లేసిన పరిస్థితి కన్పించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలుత ఉద్యోగులకు ఒకటో తేదీనే జీతాలు వేయడంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. దీంతో ఉద్యోగులంతా సంతోషపడ్డారు. కొద్ది నెలలుగా మళ్లీ పరిస్థితి అధ్వానంగా మారుతోంది. కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్, స్కీమ్ వర్కర్లకు జీతాలు సకాలంలో జమ కావడం లేదు. జీతాలు జమయ్యేసరికి దాదాపు పదో తేదీ వచ్చేస్తోంది. ఇది ఉద్యోగులకు తీవ్ర ఇబ్బందిగా పరిణమించింది. కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులంతా తమ పిల్లల చదువులతోపాటు ఇతర అవసరాలకు బజాజ్, హీరో ఫైనాన్స్ వంటి ప్రయివేటు సంస్థల నుంచి వ్యక్తిగత రుణాలు తీసుకుంటున్నారు. ఒకేసారి పెద్దఎత్తున సొమ్ము చెల్లించలేక ఇఎంఐ పద్ధతిలో బైక్, టీవీ వంటి వస్తువులు తీసుకుంటున్నారు. ఈ రుణాలకు సంబంధించిన ఇఎంఐలు రెండో తేదీ నుంచి ఐదోతేదీలోపు చెల్లించాల్సి ఉంటుంది. ఆలస్యమైతే రూ.600కుపైగా పెనాల్టీలు పడుతున్నాయి. అంతేకాకుండా సిబిల్ స్కోర్‌పై తీవ్ర ప్రభావం చూపడంతో భవిష్యత్తులో బ్యాంకుల నుంచి రుణాలు తీసుకునే పరిస్థితి లేకుండా పోతుంది. ఇది ఉద్యోగులకు పెనుశాపంగా మారింది. పెనాల్టీ రూపంలో కష్టపడిన సంపాదనంతా పోతుందనే బాధ వారిని వెంటాడుతోంది. ప్రభుత్వం సకాలంలో జీతాలు వేస్తే ఇఎంఐలు సకాలంలో చెల్లించే అవకాశం ఉంటుందని, పెనాల్టీల బాధ తప్పుతుందని వారంతా వేడుకుంటున్నారు. ప్రభుత్వం మాత్రం కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల గోడు పట్టించుకోవడం లేదు.

సెప్టెంబర్ జీతాలు ఇంకా జమకాని పరిస్థితి

ఈ నెల ఎనిమిదో తేదీ వచ్చేసినా ఇంకా సెప్టెంబర్ నెల జీతాలు కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్, స్కీమ్ వర్కర్లకు జమ కాలేదు. కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తున్న డిగ్రీ లెక్చరర్లకు ఇప్పటికీ జీతాలు జమకాలేదు. దీంతో వారంతా జీతాల కోసం ఎదురుచూస్తున్నారు. ఎయిడెడ్ ఉద్యోగులకు ఏడో తేదీన జీతాలు జమయ్యాయి. అంగన్‌వాడీలకు, ఆశా వర్కర్లకు ఎప్పటికి జీతాలు జమవుతాయో చెప్పలేని పరిస్థితి ఉంది. మధ్యాహ్న భోజన కార్మికులకు రెండు నెలల జీతాలు పెండింగ్ ఉండిపోయాయి. రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఉన్నారు. రెగ్యులర్ ఉద్యోగులకంటే ఎక్కువగా పని చేస్తున్నారు. జీతాల విషయంలో మాత్రం తీవ్ర ఆలస్యం చేయడంతో కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్, స్కీమ్ వర్కర్లు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. ప్రతినెలా ఒకటి, రెండు తేదీల్లో జీతాలు జమ చేయాలని వారంతా కోరుతున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు, స్కీమ్ వర్కర్ల గోడును పట్టించుకుంటుందో, లేదో వేచిచూడాలి.

సిజెఐపై దాడి దుర్మార్గం

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి - జిల్లావ్యాప్తంగా పెల్లుబికిన నిరసనలు



టి.నర్సాపురంలో..


జంగారెడ్డిగూడెంలో..

ప్రజాశక్తి - టి.నర్సాపురం

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై సనాతనం ధర్మం పేరుతో మతోన్మాద వ్యక్తి దాడి చేయడం దుర్మార్గమని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి అన్నారు. సిజెఐ గవాయ్‌పై దాడిని ఖండిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో మంగళవారం ఎఎస్ఆర్ నగర్ వద్ద మూడు రోడ్ల కూడలిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ ప్రజలకు అన్యాయం జరిగితే కోర్టులను ఆశ్రయిస్తామన్నారు. దేశంలో అన్ని కోర్టులకు ఉన్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై బూటుతో దాడి చేయడం హేయమైన చర్యని అన్నారు. సిజెఐపై దాడి ముమ్మాటికీ రాజ్యాంగంపై దాడేనన్నారు. ఈ దాడిని ప్రజలంతా ఖండించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి ఎ.శ్యామలారాణి, వ్యవసాయకార్మిక సంఘం నాయకులు గుడెల్లి వెంకట్రావు, మడకం సుధారాణి, కుమారి తదితరులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని బస్టాండ్ వద్ద అంబేద్కర్ విగ్రహం ముందు మంగళవారం సాయంత్రం దళిత సంఘాల నాయకులు, న్యాయవాదులు నిరసన చేపట్టారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై దాడిని తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశ అత్యున్నత న్యాయవ్యవస్థ గౌరవాన్ని దెబ్బతీయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఇలాంటి ఘటనలు ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే నిందితులను అరెస్ట్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో దళిత నాయకులు అలుగు ఆనంద్‌శేఖర్, పంతగాని వెంకన్న, మర్రి రాజశేఖర్, మానుకొండ కిషోర్, వినోద్, సురేష్, వెంకట్, నాగు, న్యాయవాదులు రాంబాబు, శ్రీను, నాయకులు, పెద్దలు పాల్గొన్నారు.

ఏలూరు అర్బన్: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై మతోన్మాద న్యాయవాది దాడి చేయడాన్ని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ఐలు రాష్ట్ర కమిటీ సభ్యులు కట్టా సత్యనారాయణ, గెద్దా విజయభాస్కర్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఇది కేవలం ఒక ఘటనగా చూడకూడదని, న్యాయ వ్యవస్థపై, రాజ్యాంగంపై దాడిగా పరిగణించాలని పేర్కొన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

8 గంటల పని కొనసాగించాలని ఆందోళన



నినదిస్తున్న నేతలు, కార్మికులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం 8 గంటల పని విధానాన్ని రద్దు చేసి 12 గంటలకు పెంచడాన్ని నిరసిస్తూ కార్మిక, కర్షక సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక పాత బస్టాండ్ సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎనిమిది గంటల పని విధానాన్ని కొనసాగించాలని, 12 గంటల పని విధానాన్ని రద్దు చేయాలని, రాజ్యాంగాన్ని కాపాడాలని నినదించారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్స్‌లో భాగంగానే రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వం కార్మికులను బానిసలుగా మార్చే 12 గంటల పని విధానాన్ని తెచ్చిందన్నారు. యజమానులకు, కార్మికుల కష్టాన్ని మరింత దోచిపెట్టే ఈ చర్యను రాష్ట్రంలోని శ్రామికవర్గం అంతా ఐక్యంగా ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ కార్మిక కర్షక ఐక్యతతో 8 గంటల పని విధానం కొనసాగించేలా పోరాడాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పిల్లి రామకృష్ణ మాట్లాడుతూ 12 గంటల పని విధానాన్ని తిప్పికొట్టాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు నగర అధ్యక్ష కార్యదర్శులు వై.కనకారావు, మంచెల్ల ఇస్సా, నగర నాయకులు పంపన రవికుమార్, కోటేశ్వరరావు, వివిఎన్ ప్రసాద్, రైతుసంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు, ఆటో యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అమర్‌కుమార్, జి.గోపీ తదితరులు పాల్గొన్నారు.


వినతులు స్వీకరిస్తున్న జాటోతు హుస్సేన్

కార్యాలయాల చుట్టూ తిప్పుకోకండి

గిరిజనుల సమస్యలపై అలసత్వం వహిస్తే చర్యలు
జాతీయ ఎస్‌టి కమిషన్ సభ్యులు జాటోతు హుస్సేన్

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

గిరిజనుల సమస్యల పరిష్కారానికి అధికారులు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి వెంటనే స్పందించాలని జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ సభ్యులు జాటోతు హుస్సేన్ ఆదేశించారు. కెఆర్‌పురంలోని ఐటిడిఎ సమావేశపు హాలులో మంగళవారం గిరిజనులు, గిరిజన సంఘాల ప్రతినిధుల నుండి ఆయన అర్జీలను స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హుస్సేన్ మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల నుండి అధికారుల చుట్టూ తిరిగినా తమ సమస్యలు పరిష్కారం కావడం లేదని ఎక్కువమంది గిరిజనులు తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. తమ సమస్యలను అధికారులకు తెలియజేస్తే పరిష్కరిస్తారనే నమ్మకంతో ప్రభుత్వ కార్యాలయాలకు వస్తుంటారని, వారి సమస్యలు పరిష్కరించకుండా కార్యాలయాల చుట్టూ తిప్పుకోవడం సరికాదన్నారు. అర్హత కలిగి, నిబంధనల మేరకు ఉన్న అంశాల ఆధారంగా వెంటనే పరిష్కారం చూపాలని, గిరిజనుల సమస్యల పట్ల అలసత్వం వహించే అధికారులపై తగువిధంగా చర్యలు తీసుకుంటామని హుస్సేన్ హెచ్చరించారు. ఆర్అండ్ఆర్ ప్యాకేజీ సక్రమంగా అమలు కాలేదని పోలవరం నిర్వాసితులు పెద్దసంఖ్యలో అర్జీలు ఇచ్చారు. జూన్ 2017 నాటికి 18 సంవత్సరాల వయస్సు నిండిన వారిని అర్హులుగా గుర్తిస్తున్నారని, అల్లూరి మన్యం జిల్లాలో 2022 అక్టోబర్ 10 నాటికి 18 సంవత్సరాలు వయస్సు నిండిన యువతను ఆర్అండ్ఆర్ ప్యాకేజీకి అర్హులుగా గుర్తిస్తున్నారని తెలిపారు. ఏలూరు జిల్లాలో కూడా అదే విధానాన్ని అమలు చేయాలని కోరారు. నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ అమలు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని హుస్సేన్ ఆదేశించారు. కార్యక్రమంలో ఐటిడిఎ పిఒ రాములు నాయక్, జంగారెడ్డిగూడెం ఇన్‌ఛార్జి ఆర్‌డిఒ ఎం.ముక్కంటి, ట్రాన్స్‌కో ఎస్ఇ సాల్మన్‌రాజు, గృహనిర్మాణ శాఖ పీడీ సత్యనారాయణ, భూసేకరణ అధికారులు, తహశీల్దార్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మండలంలోని రెడ్డిగూడెం గ్రామంలో స్థానిక గిరిజనులతో మాట్లాడిన హుస్సేన్ అధికారులపై మండిపడ్డారు. ఇకనైనా నిర్లక్ష్యం వీడి గిరిజనుల అభివృద్ధి కోసం పనిచేయాలని ఆదేశించారు. పులిరామువుగూడెంలో వెదురు ఉత్పత్తుల కేంద్రాన్ని, పాఠశాలను పరిశీలించారు.

మేము ఇచ్చిందే.. మీరు రాసుకోండి..!

- జిల్లా ఉన్నతాధికారులు హుకుం
- కలెక్టరేట్‌లో కీలక సమావేశాలకు మీడియాపై ఆంక్షలు
- కొల్లేరు సమస్యపై అటవీశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, ఎంఎల్ఎలు హాజరు
- సమాచార శాఖ ఇచ్చిందే రాసుకోవాలన్నట్లు వ్యవహారం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జిల్లా కలెక్టరేట్‌లో జరిగే కీలకమైన ప్రజా సమస్యలపై జరిగే సమావేశాలకు మీడియాపై జిల్లా ఉన్నతాధికారులు ఆంక్షలు విధించడం చర్చనీయాంశమవుతోంది. జిల్లాలో అతిపెద్ద సమస్యగా ఉన్న కొల్లేరుపై మంగళవారం కలెక్టరేట్‌లో రాష్ట్ర అటవీశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆర్‌డిఒ, ఆయా మండలాల తహశీల్దార్లు, ఫారెస్టు అధికారులు, సర్వే, రెవెన్యూ అధికారులతోపాటు, కొల్లేరు ప్రాంత ఎంఎల్ఎలు కామినేని శ్రీనివాస్, చింతమనేని ప్రభాకర్, పత్సమట్ల ధర్మరాజు, ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు పాల్గొన్నారు. కొల్లేరు సమస్యపై సుదీర్ఘ చర్చసాగింది. కొల్లేరులో కీలక సమస్యలను ఎంఎల్ఎలు లేవనెత్తినట్లు తెలిసింది. అటవీశాఖ అధికారుల తీరును తప్పుబట్టినట్లు తెలుస్తోంది. కొల్లేరు సమస్య పరిష్కారం కోసం పది మండలాల పరిధిలోని 120 గ్రామాలకు చెందిన దాదాపు మూడు లక్షల మంది ప్రజలు ఏళ్లతరబడి ఎదురుచూస్తున్నారు. మూడు నెలల క్రితం కేంద్ర సాధికారిక కమిటీ కొల్లేరులో పర్యటించింది. సమస్య పరిష్కారం కోసం అక్కడి ప్రజలు వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్నారు. కొల్లేరు సమస్యపై ప్రజాప్రతినిధులు ఏం మాట్లాడారు, అధికారులు ఏం సమాధానం ఇచ్చారు. అటవీశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అధికారులకు ఎటువంటి ఆదేశాలు జారీ చేశారో సమాచారం కొల్లేరు ప్రజలకు అవసరం. సమాచార శాఖాధికారులు ఏం రాసిస్తే అదే వార్త మీడియాలో రావాలన్నట్లు జిల్లా ఉన్నతాధికారులు వ్యవహరిస్తున్నారనే పరిస్థితి నెలకొంది. ప్రజాప్రతినిధులు అధికారులను అడిగే కీలక ప్రశ్నలకు సంబంధించిన సమాచారాన్ని సమాచార శాఖాధికారులు ఎట్టి పరిస్థితుల్లోనూ మీడియాకు ఇచ్చే అవకాశం ఉండదు. సమావేశంలో జరిగిన వాస్తవాలు ప్రజలకు తెలియాలంటే మీడియా ప్రత్యక్షంగా ఉండాల్సి ఉంటుంది. గత ప్రభుత్వంలోనూ మీడియాపై తీవ్ర నిర్బంధం సాగింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా అధికారులు అదేవిధంగా వ్యవహరిస్తున్నారనే పరిస్థితి ఏర్పడింది. దీనిపై ప్రభుత్వంతోపాటు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ జోక్యం చేసుకుని మీడియాపై విధిస్తున్న ఆంక్షలపై చర్యలు తీసుకోవాలని అంతా కోరుతున్నారు.



మాట్లాడుతున్న నిర్మలాదేవి

విఒఎలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

విఒఎలు, మెప్మా ఆర్‌పిల జిల్లా మహాసభలో ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.నిర్మలాదేవి

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

విఒఎలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని విఒఎల సంఘం (సిఐటియు) రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.నిర్మలాదేవి డిమాండ్ చేశారు. వెలుగు విఒఎ ఉద్యోగుల సంఘం, మెప్మా ఆర్‌పిల జిల్లా మహాసభ స్థానిక బంగారు తల్లి కళ్యాణమండపంలో జరిగింది. మహాసభకు సిహెచ్.నాగలక్ష్మి, బి.వెంకటేశ్వరరావు, వై.మరియమ్మ అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. తొలుత సిఐటియు జెండాను యూనియన్ జిల్లా అధ్యక్షులు సిహెచ్.నాగలక్ష్మి ఆవిష్కరించారు. ముఖ్యఅతిథి నిర్మలాదేవి మాట్లాడుతూ విఒఎలు సిఐటియు ఆధ్వర్యంలో అనేక సంవత్సరాలుగా చేసిన పోరాటాల ఫలితంగానే కొన్ని సమస్యలు పరిష్కరించుకోగలిగామన్నారు. విఒఎలకు ప్రభుత్వమే 5జి ఫోన్లు అందజేయాలని కోరారు. ఆన్‌లైన్ వర్క్ పేరుతో మోపిన పని భారం తగ్గించాలని కోరారు. ద్వారకాతిరుమల మాజీ జెడ్‌పిటిసి ఎం.లక్ష్మీరమణి, మండల ప్రధాన కార్యదర్శి బద్రి, సర్పంచి స్వర్ణలత మాట్లాడుతూ విఒఎలకు తమ ప్రభుత్వం సానుకూలంగా ఉంటుందన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ మాట్లాడుతూ విఒఎలకు కాలపరిమితి సర్క్యులర్‌తో అనేక ఇబ్బందులు పడుతున్నారని, ఆ సర్క్యులర్ వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.నాగమణి మాట్లాడుతూ అందరూ ఐక్యంగా ఉంటే మన హక్కులు సాధించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి షేక్ సుభాషిణి, విజయకుమారి, కృష్ణవేణి, రజియా, జగదాంబ, మేరీ, నాగలక్ష్మి, శివ, వాణి, తదితరులు పాల్గొన్నారు.

మా సమస్యలు పరిష్కరించండి

పిహెచ్‌సిల వద్ద ఆశాల ధర్నా

ప్రజాశక్తి - పోలవరం

ఆశ వర్కర్ల సమస్యల పరిష్కారం చేయాలని డిమాండ్ చేస్తూ పోలవరం మండలం ఎల్లండిపేట, వింజరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించి వైద్య సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.పోశమ్మ మాట్లాడుతూ పాలక ప్రభుత్వం ఆశా వర్కర్లకు కనీస వేతనాలు ఇస్తామని హామీ ఇచ్చి 17 మాసాలైనా నేటి వరకు వేతనము పెంపు జరగలేదన్నారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జిల్లా నాయకులు కుసుమ, రామలక్ష్మి, భవాని, బంగారు తల్లి, వెంకటలక్ష్మి, జయలక్ష్మి, వీరలక్ష్మి, నాగలక్ష్మి పాల్గొన్నారు.

ఏలూరు అర్బన్ : ఆశ డే సందర్భంగా ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా మంగళవారం జిల్లాలోని అన్ని పిహెచ్‌సి, యుపిహెచ్‌సిల వద్ద ఆశా వర్కర్లు ధర్నాలు నిర్వహించి వైద్య సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.కమల, కె.పోశమ్మ మాట్లాడుతూ పాలక ప్రభుత్వం ఆశా వర్కర్లకు కనీస వేతనాలు ఇస్తామని హామీ ఇచ్చి 17 మాసాలైనా నేటి వరకు వేతనం పెంపు జరగలేదని, ఈ కాలంలో పని భారం, ఒత్తిడి వల్ల అనారోగ్యాలు పాలై వర్కర్లు మరణిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరణించిన ఆశ వర్కర్లకు మట్టి ఖర్చులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

టి.నరసాపురం : గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తున్న ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, సమస్యలు పరిష్కరించాలని సిఐటియు ఆధ్వర్యాన ఆశా వర్కర్లు మంగళవారం స్థానిక పిహెచ్‌సి వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని వైద్య సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భంగా ఎపి ఆశావర్కర్ల సంఘం మండల కమిటీ అధ్యక్షులు యలమంచిలి విజయలక్ష్మి మాట్లాడుతూ పెరుగుతున్న పని భారంతో పాటు చాలీచాలని వేతనాలతో ఆశా వర్కర్స్ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రస్తుత పాలకులు అధికారంలోకి వస్తే వేతనాలు పెంచుతామని ఎన్నికల ముందు వాగ్దానం చేశారు. కానీ అధికారంలోకి వచ్చి 17 నెలలైనా హామీని అమలు చేయలేదన్నారు. ఆశాలకు కనీస వేతనాలు చెల్లించాలని, కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్‌ను ఆశా వర్కర్లుగా మార్పు చేయాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు అనుమోలు మురళీ, ఆశా వర్కర్లు కిన్నెర పాల్గొన్నారు.


పోలవరం : నినదిస్తున్న యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.పోశమ్మ


నూజివీడు టౌన్‌లో..

చింతలపూడి : పిహెచ్‌సి వద్ద సమస్యలు పరిష్కరించాలని ఆశా కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. ఆశా కార్యకర్తలు తక్షణ డిమాండ్లు పరిష్కరించాలని, పిహెచ్‌సి వైద్యులు చేస్తున్నటువంటి సమ్మెకు సిఐటియు, ఆశా యూనియన్ మద్దతు తెలియజేస్తున్నాయని, వైద్యుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని సిఐటియు మండల కన్వీనర్ నత్త వెంకటేశ్వరరావు కోరారు. రాఘవాపురం, యర్రగుంటపల్లి పిహెచ్‌సిల వద్ద రాష్ట్ర కమిటీ పిలుపుపై ఆశా కార్యకర్తలు ధర్నా నిర్వహించి తమ సమస్యల పరిష్కారానికి మెమోరాండాన్ని అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో రాఘవాపురం పిహెచ్‌సి వద్ద యూనియన్ నాయకురాలు పుష్పరాణి, యర్రగుంటపల్లి పిహెచ్‌సి వద్ద ఆశ యూనియన్ జిల్లా నాయకురాలు సిహెచ్.పుణ్యవతి, బి.సరళ, అశ్వినీ, సంపూర్ణమ్మ పాల్గొన్నారు.

ముసునూరు : ఆశా వర్కర్లకు కనీస వేతనం ఇవ్వాలని ఆశ వర్కర్ల యూనియన్ మండల కార్యదర్శి చిన్నారి అన్నారు. మంగళవారం మండలంలోని ముసునూరు, రమణక్కపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్ద మండలంలోని 16 గ్రామాల ఆశా వర్కర్లు అందరూ పాల్గొని పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి కె.శ్రీనివాస్, ఆశాలు పాల్గొన్నారు.

నూజివీడు టౌన్ : నూజివీడు పట్టణ పరిధిలోని కోనేరు పేటలో గల అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం ఆశా వర్కర్లు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కమల మాట్లాడుతూ ఆశ వర్కర్లు గత 20 సంవత్సరాలుగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తున్నారన్నారు. పెరుగుతున్న పని భారంతో పాటు, చాలీచాలని జీతాలతో అనేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

కుక్కునూరు రూరల్ : ఆశా వర్కర్లకు కనీస వేతనాలు అమలు చేసి, పని భారం తగ్గించాలని సిఐటియు మండల కన్వీనర్ యర్నం సాయికిరణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా కుక్కునూరు, అమరవరం పిహెచ్‌సిల వద్ద ధర్నా చేసి హాస్పటల్ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సాయికిరణ్ మాట్లాడారు. కార్యక్రమంలో ఆశా యూనియన్ కార్యదర్శి కాక బాపనమ్మ, అర్ధ నాగమణి, సునీత, సరస్వతి, సరోజిని, మిడియం ఆదెమ్మ, రమణ, మార్తమ్మ, కుమారి, స్వర్ణలత, ఈశ్వరమ్మ, విజయ పాల్గొన్నారు.

కలిదిండి : మండలంలోని కోరుకొల్లు, కలిదిండి, మూలలంక పిహెచ్‌సిల వద్ద ఆశా వర్కర్స్ నిరసన తెలిపి తమ సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు. ఆశా డే సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం తమకు కనీస సౌకర్యాలు కల్పించడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. సిఐటియు మండల కన్వీనర్ జక్కుల మహేష్, ఆశా నాయకులు అరుణ, పద్మ, ఆయా పరిధిలోని ఆశాలు పాల్గొన్నారు.

30, 31 తేదీల్లో జంగారెడ్డిగూడెంలో

రైతు సంఘం జిల్లా మహాసభ

కరపత్రాలు ఆవిష్కరించిన నేతలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

రైతు రక్షణ, వ్యవసాయ రంగ పరిరక్షణ కోసం ఎపి రైతుసంఘం కృషి చేస్తోందని ఆ సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ చెప్పారు. స్థానిక యుటిఎఫ్ భవనంలో ఈ నెల 30, 31 తేదీల్లో జంగారెడ్డిగూడెంలో నిర్వహించే సంఘం జిల్లా 23వ మహాసభ నిర్వహణా కమిటీ సమావేశం ఆ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బొడ్డు రాంబాబు అధ్యక్షతన నిర్వహించారు. అనంతరం జిల్లా మహాసభ కరపత్రాలను జిల్లా నేతలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ రైతు మనుగడ కోసం ఉద్యమాలే మార్గమన్నారు. వ్యవసాయరంగం సంక్షోభంలో ఉందని, రైతులు ఇబ్బందుల్లో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు ఆత్మహత్యల్లో దేశంలో మన రాష్ట్రం మూడోస్థానంలో ఉందని, దీన్నిబట్టి రైతుల పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థమవుతుందని చెప్పారు. జంగారెడ్డిగూడెంలో నిర్వహిస్తున్న సంఘం జిల్లా మహాసభను జయప్రదం చేయాలని కోరారు. ఈ మహాసభకు జిల్లాలోని అన్ని మండలాల నుండి 250 మంది రైతు ప్రతినిధులు, రైతుసంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు హాజరుకానున్నారని వివరించారు. అన్ని పంటల రైతాంగ సమస్యలపై చర్చించి తీర్మానాలు చేస్తారన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సిరిబత్తుల సీతారామయ్య, మండల అధ్యక్షులు అనపర్తి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు బోడిక రామచంద్రరావు, గోలి నర్సిరెడ్డి, సహాయ కార్యదర్శులు మాండ్రు సూర్యచంద్రం, అల్లూరి వెంకట రామరాజు, సిఐటియు మండల కన్వీనర్ పసల సూర్యారావు, పలువురు రైతులు పాల్గొన్నారు.


కరపత్రం ఆవిష్కరించిన నేతలు

ఆర్‌టిసి బంకులో రూ.75 లక్షలు స్వాహా..!

ఆడిట్‌లో వెల్లడైనా.. విచారణ పేరిట నోరు మెదపని అధికారులు - డిపో, జిల్లా స్థాయి అధికారుల హస్తం ఉందని ఆరోపణలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఆర్‌టిసి నిర్వహిస్తున్న పెట్రోల్ బంకులో రూ.75 లక్షలు గోల్‌మాల్ కావడం సంబంధిత అధికారులను కుదిపేస్తోంది. దీనిపై లెక్కలు తేల్చే పనిలో కొంతమంది అధికారులు తలమునకలై ఉన్నట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ఏలూరు ఆర్‌టిసి బస్టాండ్ ఎదురుగా ఉన్న డిపో మేనేజర్ కార్యాలయం పక్కనే సుమారు ఐదేళ్ల క్రితం ఆర్‌టిసి యాజమాన్యం పెట్రోల్ బంక్ ప్రారంభించింది. ఆర్‌టిసికి ఇది కొంత అదనపు ఆదాయం చేకూరుస్తుందని భావించారు. అయితే కొందరి చేతివాటం ప్రస్తుతం అధికారులకు చుక్కలు చూపిస్తోంది. సుమారు రూ.75 లక్షలు గోల్‌మాల్ జరిగినట్లు నెల రోజుల క్రితం ఆర్‌టిసి హెడ్డాఫీస్ నుంచి వచ్చి నిర్వహించిన సాధారణ ఆడిట్‌లో ఈ విషయం వెలుగుచూడటంతో అంతా కంగుతిన్నారు. దీనిపై మూడు రోజుల క్రితం విజయవాడ ఇడి విజయరత్నం విచారణ నిర్వహించినట్లు సమాచారం. దీనికి కారకులపై నిగ్గు తేల్చాలని ఆయన జిల్లా అధికారులను ఆదేశించడంతో మూడు రోజులుగా అత్యంత రహస్యంగా ఈ విషయంపై విచారణ నిర్వహిస్తున్నారు. బంకులో సూపర్‌వైజర్‌గా ఆర్‌టిసి ఉద్యోగి విధులు నిర్వహిస్తుండగా, మిగిలిన సిబ్బంది అంతా బయటి వారే. ఆన్‌లైన్ పేమెంట్ల ద్వారానే రూ.75



ఆర్‌టిసి పెట్రోల్ బంక్

లక్షలు సిబ్బంది, సూపర్‌వైజర్ కలిసి స్వాహా చేసినట్లు ప్రచారం సాగుతోంది. క్రెడిట్ కార్డులు, యుపిఐ ద్వారా వినియోగదారులు చెల్లించిన సొమ్ము వారి సొంత ఖాతాలకు మళ్లించినట్లు చెబుతున్నారు. ఈ పెట్రోల్ బంకు లావాదేవీలపై కొన్నేళ్లుగా ఎలాంటి ఆడిట్ నిర్వహించకపోవడాన్ని ఆసరాగా తీసుకున్న సిబ్బంది, సూపర్‌వైజర్ ఈ గోల్‌మాల్‌కు పాల్పడ్డారని మరికొంతమంది ఆరోపిస్తున్నారు. బంకులో సూపర్‌వైజర్‌గా ఒకరినే ఏర్పాటు చేశారని, అందువల్లే సొమ్ము పక్కదారి పట్టిన విషయం ఇప్పటి వరకూ గోప్యంగా ఉంచినట్లు తెలుస్తోంది. ఆర్‌టిసి నుంచే ముగ్గురు సూపర్‌వైజర్లు ఉంటే షిఫ్ట్ విధానంలో ఒకరు డ్యూటీ దిగి మరొకరు విధులకు హాజరైనప్పుడు లెక్కలు చూసుకునే అవకాశం ఉండేది. సంవత్సరాలు తరబడి ఒకరే సూపర్‌వైజర్‌గా ఉండటం ఈ అవినీతికి ఆస్కారం కల్పించినట్లయిందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. సొమ్ము చెల్లించేందుకు ఉపయోగించే స్కానర్లు మార్చి సిబ్బంది సొంత స్కానర్లు ఏర్పాటు చేశారని, అందువల్ల వినియోగదారులు చెల్లించే సొమ్ము నేరుగా సిబ్బంది ఖాతాల్లోకి వెళ్లిందని ప్రచారం సాగుతోంది. ఈ మొత్తం భాగోతంలో సూపర్‌వైజర్ ముఖ్యపాత్ర పోషించారని, దీనిలో డిపో ఉన్నతాధికారితోపాటు, జిల్లా ప్రజా రవాణా అధికారి కార్యాలయం హస్తం కూడా ఉందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అందుకే సంవత్సరాల తరబడి ఆడిట్ చేయకుండా వదిలేశారని విమర్శలు విన్పిస్తున్నాయి. విచారణ జరుగుతున్నప్పటికీ ఎంత సొమ్ము పక్కదారి పట్టించారనే విషయం కూడా చెప్పడానికి ఉన్నతాధికారులు ఇష్టపడటం లేదు. విచారణ పూర్తయిన తర్వాతైనా ఉన్నతాధికారులు విషయాన్ని బయటకు చెప్పి నేరస్తులకు తగిన శిక్షపడేలా చర్యలు తీసుకుంటారో, లేక అలాగే దాచిపెట్టి ఏమీ జరగలేదని అవినీతిని కప్పిపెడతారో వేచిచూడాలి.

ఈ విషయంపై జిల్లా ప్రజా రవాణాధికారి ఎస్‌కె.షబ్నంను వివరణ కోరగా విచారణ జరుగుతుందని, విచారణ పూర్తవడానికి మరో వారం రోజులు పడుతుందని, అప్పటివరకు ఏ విషయమూ చెప్పలేమని తెలిపారు.

'ఓటర్ల జాబితా అవకతవకలపై దేశవ్యాప్త ఉద్యమం'

ఏలూరు సిటీ : ఓటర్ల జాబితా అవకతవకలపై కాంగ్రెస్ దేశవ్యాప్తంగా ఉద్యమం చేస్తుందని, సెప్టెంబర్ 15 నుంచి అక్టోబర్ 15 వరకు దేశవ్యాప్తంగా కాంగ్రెస్ తలపెట్టిన సంతకాల సేకరణ ఉద్యమానికి మద్దతు తెలపాలని ఎపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జెడి శీలం, ఎఐసిసి జాయింట్ సెక్రటరీ డాక్టర్ పాలక్‌వర్మ కోరారు. ఏలూరులోని కాంగ్రెస్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన పత్రిక సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలకు తూట్లు పొడుస్తూ, ప్రజాస్వామ్యాన్ని అవమానిస్తూ ప్రజల కోట్లను దోచుకుని మూడోసారి గద్దెనెక్కిందని మండిపడ్డారు. ఓటర్ల జాబితాలో అనేక అవకతవకలకి పాల్పడి లేని ఓట్లను ఉన్నట్లుగా చూపించి, ఉన్న ఓట్లను తొలగించి బిజెపి ఓట్ చోరీకి పాల్పడిందని అన్నారు. ఎన్నికలకు చివరి నిమిషంలో ఓట్ల తొలగింపు లేదా చేర్పులు నివారించాలని, స్పష్టమైన కటాఫ్ తేదీని ముందుగానే ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాజనాల రామ్మోహన్‌రావు, చింతలపూడి మాజీ ఎంఎల్‌ఎ ఎలిజ, కిసాన్ కాంగ్రెస్ స్టేట్ ఛైర్మన్ ప్రభాకర్ రావు, సత్యాంధ్ర పిసిసి జనరల్ సెక్రెటరీ, కాంగ్రెస్ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

అర్హత బట్టి రుణ మంజూరు

సొసైటీ ఛైర్మన్ దేవినేని శ్రీధర్

ముసునూరు : వ్యవసాయ భూమి ఉన్న ప్రతి రైతుకు తమ అర్హతను బట్టి రుణం మంజూరు చేయడం జరుగుతుందని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం సొసైటీ ఛైర్మన్ దేవినేని శ్రీధర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన ముసునూరు సొసైటీలో సొసైటీ కార్యదర్శి దాసిరెడ్డి లక్ష్మణ్ కుమార్ ఆధ్వర్యాన సొసైటీ ఛైర్మన్ దేవినేని శ్రీధర్ అధ్యక్షతన 22 మంది రైతులకు గాను దీర్ఘకాలిక రుణాల్లో భాగంగా రూ.కోటి 23 లక్షల 17 వేల రుణం మంజూరు చేసి చెక్కులు అందజేశారు. అదేవిధంగా 9 మంది రైతులకు గాను క్రాప్ లోన్‌లో భాగంగా రూ.11 లక్షల ఇరవై వేల రుణం మంజూరు చేసి చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగు యువత కార్యదర్శి కొండేటి బాబి, ఉప సర్పంచి తోట శ్రీను, స్కూల్ మాజీ కమిటీ ఛైర్మన్ నక్క యోహాను, టిడిపి నాయకులు టి.రంగరావు, త్రిసభ్య కమిటీ సభ్యులు జి.కాటమరాజు, చీలి లక్ష్మి, టిడిపి నాయకులు, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాస్థాయి స్కూల్ గేమ్స్‌కు త్రివిధ విద్యార్థులు ఎంపిక

నూజివీడు టౌన్ : జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్‌కు నూజివీడు మండలం తరుపున వివిధ ఆటల పోటీలకు పట్టణంలోని త్రివిధ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు ఆ స్కూల్ ప్రిన్సిపల్ శ్రీనివాస్ తెలిపారు. ఖో ఖో జూనియర్స్ అండర్-14 జి.లిఖిత్ 8వ తరగతి ఎన్.నవతేజ్ 9వ తరగతి, ఖో ఖో అండర్-17 ఎస్.ప్రణవ్ 10వ తరగతి, కె.ఉదయ్ 10వ తరగతి, కబడ్డీ అండర్-14 జి.యశ్వంత్ 7వ తరగతి, కబడ్డీ అండర్-17 ఎన్.వివేక్ 10వ తరగతి, డి.ఉమా మహేశ్వర్ సింగ్ 10వ తరగతి, ఎ.మనోజ్ 10వ తరగతి ఎంపికయ్యారు. బాడ్మింటన్ అండర్-14 ఎ.మోక్షజ్ఞ 7వ తరగతి, ఎం.నిహంత్ కుమార్ 10వ తరగతి, వాలీ బాల్ అండర్-14, నాగహృదిక్ 8వ తరగతి, ఎ.మోక్షజ్ఞ 7వ తరగతి, వాలీబాల్ అండర్-17 ఆర్.ఇషాక్ 10వ తరగతి, ఎస్.రాంచరణ్ 10వ తరగతి, సిహెచ్.రాహుల్ 10వ తరగతి, యోగ అండర్-17 ఎం.రాజా 10 తరగతి ఎంపికయ్యారు.

10న విద్యుత్ వినియోగదారుల అదాలత్

నూజివీడు టౌన్ : పట్టణంలోని కొన్నంగుంట రోడ్‌లో గల జిపి గ్రాండ్ కళ్యాణ మండపంలో ఈనెల 10వ తేదీన విద్యుత్ వినియోగదారుల అదాలత్ అవగాహన సదస్సు వినియోగదారుల ఫారం ఛైర్మన్ ఎన్.విక్టర్ ఇమ్మానుయేల్ సమక్షంలో నిర్వహిస్తున్నామని విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎ.సత్యనారాయణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు తమ కరెంటు బిల్లులకు సంబంధించి, కొత్త సర్వీసులకు సంబంధించి, ఇంకా ఏ ఇతర విద్యుత్ సేవా సమస్యలు ఉన్నా విద్యుత్ వినియోగదారుల అదాలత్ అవగాహన సదస్సు కార్యక్రమానికి హాజరై రాతపూర్వక ఫిర్యాదు తెలియపరచి, సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు.

ఇసుక అక్రమ రవాణా..!


బూరుగువాయి గ్రామంలో అధికారుల నిర్లక్ష్యంపై ఆరోపణలు

కుక్కునూరు : మండల కేంద్రంలోని బూరుగువాయి గ్రామం వద్ద సోమవారం రాత్రి నుంచి భారీగా ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నట్లు స్థానికుల నుంచి సమాచారం అందింది. పాములేరు నదీ పరీవాహక ప్రాంతంలో ఉన్న ఈ గ్రామం నుంచి అర్ధరాత్రి వేళల్లో తెలంగాణ బోర్డర్ మీదుగా ఇతర ప్రాంతాలకు ట్రాక్టర్లు, లారీలతో ఇసుకను రహస్యంగా తరలిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఈ అక్రమ కార్యకలాపాలపై ముందుగానే సమాచారం అందించినప్పటికీ సంబంధిత అధికారుల చర్యలు పూర్తిగా లోపించాయని, ఇది పర్యావరణానికి, స్థానిక సమాజానికి తీవ్ర నష్టాన్ని కలిగిస్తోందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా పరిధిలో ఇటీవల ఇసుక అక్రమ రవాణాపై కఠిన చర్యలు ప్రకటించినప్పటికీ, ఈ సంఘటన అధికారుల నిర్లక్ష్యాన్ని బహిర్గతం చేస్తోంది.

ధాన్యాన్ని పూర్తిగా కొనుగోలు చేయాలి

మద్దతు ధరకు అదనంగా ప్రభుత్వం బోనస్ ప్రకటించాలి

రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్, జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు



మాట్లాడుతున్న శ్రీనివాస్

ప్రజాశక్తి - నిడమర్రు

రైతు పండించిన పూర్తి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు అదనంగా రాష్ట్ర ప్రభుత్వం క్వింటాల్ ధాన్యానికి రూ.500 బోనస్ ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్, జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని భువనపల్లిలోని వేణుగోపాల స్వామి గుడి వద్ద రైతు సంఘం మండల మహాసభ రైతు సంఘం సహాయ కార్యదర్శి కోన శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. మండలంలోని పలు రైతాంగ సమస్యలు చర్చించి తీర్మానాలు ఆమోదించారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్, కట్టా భాస్కరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం రైతులు పండించిన ధాన్యంలో 60 శాతం మాత్రమే కొనుగోలు లక్ష్యంగా ప్రకటించడం వల్ల మిగిలిన పంటను దళారులకు, వ్యాపారులకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. దళారులు, వ్యాపారుల మోసాలకు గురై రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల పండించిన ధాన్యాన్ని పూర్తిగా కొనుగోలు చేసేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. ట్రంప్ సుంకాల వల్ల ఆక్వా రంగం దెబ్బతింటుందని, ఆక్వా రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మహాసభలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి గవర సత్యనారాయణ, సిఐటియు నాయకులు కానూరి రాజు మాట్లాడారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా వెలగలేటి మోహన్, కార్యదర్శిగా లావేటి సోంబాబు, ఉపాధ్యక్షులుగా సంకు కోటసత్తిబాబు, సహాయ కార్యదర్శిగా వలుపు ఏసు, మరో 9 మందితో నూతన కమిటీ ఎన్నిక జరిగింది.

సంక్షేమ పథకాలు అమలు చేయాలి

భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు రమణారావు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలను అమలు చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు నారపల్లి రమణారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండలాల్లోని ములగలంపల్లి గ్రామంలో మదర్ థెరిస్సా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ 2వ వార్షికోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించి అనంతరం వార్షికోత్సవం సభ మడకం కృష్ణ, మస్తాన్, పల్లంటి రాంబాబు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రమణారావు మాట్లాడుతూ రాష్ట్రంలో 25 లక్షలకు పైగా భవన నిర్మాణ కార్మికులకు నిర్మాణ రంగంలో ఉపాధి పొందుతూ 18 లక్షలకుపైగా రాష్ట్ర బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డులో తమ పేర్లు నమోదు చేసుకున్నారన్నారు. అనేక రాష్ట్రాల్లో భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలవుతున్నాయన్నారు. సిఐటియు జిల్లా కార్యదర్శి యర్నం సాయికిరణ్ మాట్లాడుతూ సిఐటియు ఏర్పడిన తర్వాత మొట్టమొదటిసారిగా ఆంధ్రప్రదేశ్‌లో సిఐటియు 18వ జాతీయ మహాసభలు జరగటం రాష్ట్రంలోని కార్మికులందరికీ గర్వకారణం అని, ఆంధ్రప్రదేశ్లో పారిశ్రామిక ప్రధాన కేంద్రమైన విశాఖ ఈ మహాసభకు వేదిక కానుందని, దేశం నలమూలల నుంచి కాకలి తీరని కార్మిక నాయకులు కొలువతీరనున్నారని తెలిపారు. మహాసభలు జయప్రదం చేయాలని సాయికిరణ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎర్ర రాంబాబు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పసల సూర్యారావు, సిఐటియు మండల కన్వీనర్ చిట్టి బొమ్మ కొండలరావు, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రమణారావు

రాబోయే కాలానికి నేటి విద్యార్థులే పునాది రాళ్లు

డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు

ఏలూరు సిటీ : అపరిమితమైన విషయపరిజ్ఞానమే విద్యార్థులను భవిష్యత్తులో సమయం ఎంచుకున్న రంగంలో నిష్ణాతులను చేస్తుందని, రాబోయే కాలానికి నేటి విద్యార్థులే పునాదిరాళ్లు అని, నేటి విద్యార్థులదే భవిష్యత్తు కాలమని, ఎటువంటి ఒడిదుడుకులు వచ్చిన భయపడకుండా జీవితంలో ముందుకు వెళ్లాలని ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు విద్యార్థులకు సూచించారు. ఏలూరులోని కలెక్టరేట్ పరిధిలో గల ఇండోర్ స్టేడియం వద్ద మంగళవారం శ్రీచైతన్య విద్యార్థులకు కెఎల్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో మన రాష్ట్రం-మన దేశం-మన యూనివర్సిటీ థీమ్‌తో అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి, శ్రీచైతన్య విద్యాసంస్థల ఎజిఎం వివి.రాంబాబు హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం రఘురామ కృష్ణరాజు మాట్లాడుతూ విద్యార్థులకు భవిష్యత్తు అవకాశాలపై అవగాహనను కల్పిస్తూ ఏర్పాటుచేసిన కెఎల్ యూనివర్సిటీ వారిని అభినందించారు. విద్యార్థులు ఇంటర్మీడియట్ పూర్తి అయిన తర్వాత ఏం చదవాలి అనే సందేహంలో ఉంటారని, వారికి ఇటువంటి కార్యక్రమాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తే మంచి భవిష్యత్తు వైపు దూసుకెళ్తారని అన్నారు. అనంతరం రఘురామకృష్ణరాజును, ఎంఎల్‌ఎ బడేటి చంటిని కెఎల్ యూనివర్సిటీ వారు ఘనంగా సన్మానించారు. కెఎల్ యూనివర్సిటీ డైరెక్టర్ జె.శ్రీనివాసరావు, శ్రీచైతన్య కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొల్లేరు ప్రజలకు అనుగుణంగా చర్యలు

రాష్ట్ర అటవీశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే

ఏలూరు : కొల్లేరు ప్రజల మనోభావాలకు అనుగుణంగా చర్యలు ప్రభుత్వానికి నివేదించి, తదనంతరం చర్యలు తీసుకుంటామని రాష్ట్ర అటవీశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే అన్నారు. జిల్లా కలెక్టరేటు గౌతమి సమావేశ మందిరంలో మంగళవారం కొల్లేరు ప్రాంతం అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంపై జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి, అటవీ, పర్యావరణ శాఖల ప్రత్యేక కార్యదర్శి శరవణనన్, ఎపి ఆప్కాబ్, ఉమ్మడి జిల్లాల డిసిసిబి ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు, కైకలూరు ఎంఎల్‌ఎలు డాక్టర్ కామినేని శ్రీనివాస్, దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్, ఉంగుటూరు ఎంఎల్‌ఎ పత్సమట్ల ధర్మరాజు, సంబంధిత అధికారులతో సుదీర్ఘంగా కొల్లేరు ప్రాంత మండలాల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో ఏలూరు అర్బన్, ఏలూరు రూరల్, భీమడోలు, దెందులూరు, పెదపాడు, నిడమర్రు, ఉంగుటూరు, కైకలూరు, మండవల్లి, పశ్చిమగోదావరి జిల్లాలో ఆకివీడు మండలం కలిపి మొత్తం ఉమ్మడి జిల్లాలో పది మండలాల్లో కొల్లేరు ప్రాంతం ఉందని వివరించారు. ఇప్పటి వరకు జరిగిన అభివృద్ధి పనులు, తీసుకున్న చర్యలు, కొల్లేరు విస్తీర్ణం మ్యాపు ద్వారా కలెక్టర్ రాష్ట్ర అటవీశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే, అటవీ, పర్యావరణం శాఖల ప్రత్యేక కార్యదర్శి శరవణనన్‌కు వివరించారు. ఎపి అప్కాబ్, ఉమ్మడి జిల్లాల ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ ఎన్‌డియే ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16 నెలలకుపైగా అవుతుందని, కొల్లేరు ప్రాంత సమస్యలు తీరి అభివృద్ధి కోసం కొల్లేరు ప్రజలు ఎదురు చూస్తున్నారని అన్నారు. జిల్లాలో కొల్లేరు, అటవీ భూములు సరిహద్దులకు సంబందించిన సమస్యలపై వెంటనే చర్యలు తీసుకోవలసిన అవసరం ఉందని అన్నారు. దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ తమకు, అటవీశాఖ అధికార్లకు సమన్వయం కొరవడిందని, కనీసం మాకు సమాచారాన్ని కూడా ఇవ్వడం లేదన్నారు. కోమటిలంకకు చాలా సమస్యలు ఉన్నాయని, బ్రిడ్జి నిర్మాణంకు ఇంకా అనుమతులు రాలేదని చెప్పారు. కైకలూరు ఎంఎల్‌ఎ డాక్టర్ కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ కొల్లేరు ప్రాంత అభివృద్ధి చాలామటుకు చేసుకోగలిగామని, మిగిలిన పనులు కూడా పూర్తయ్యేలా చూడాలని కోరారు. ఉంగుటూరు ఎంఎల్‌ఎ పత్సమట్ల ధర్మరాజు మాట్లాడుతూ తమ నియోజకవర్గంలో ప్రభుత్వ భూముల్లో ఆక్వా చెరువులు లేవని, అంతా క్లియర్‌గా ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ ఎం.అచ్యుత అంబరీష్, ఆయా మండలాల తహశీల్దార్‌లు, ఫారెస్టు రేంజి అధికారులు పి.మోహిని విజయలక్ష్మి, కెవి.రామలింగా ఆచార్యులు, డిప్యూటీ తహశీల్దార్లు, సర్వే అధికార్లు, రెవెన్యూ, అటవీశాఖ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

స్వచ్ఛ ఆంధ్ర అవార్డు దక్కడం సంతోషంగా ఉంది

రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ ఎబిఐఎస్‌వి.ప్రసాద్

ఏలూరు అర్బన్ : ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా శాఖకు జిల్లా స్థాయిలో ఉత్తమ స్వచ్ఛ ఆంధ్ర అవార్డు దక్కడం సంతోషంగా ఉందని రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ ఎబిఐఎస్‌వి.ప్రసాద్ తెలిపారు. మంగళవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రతినెలా మూడవ శనివారం రెడ్ క్రాస్ వాలంటీర్లు, కళాశాల విద్యార్థులతో ప్రభుత్వ ఆసుపత్రి, పార్కులు, బస్టాండు వంటి పబ్లిక్ స్థలాలలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, పరిసరాల పరిశుభ్రత, మొక్కలు నాటడం, ప్లాస్టిక్‌ను నివారించేలా అవగాహన కల్పిస్తున్నందుకుగాను సోమవారం సర్ సిఆర్ రెడ్డి డిగ్రీ కళాశాలలో జరిగిన జిల్లాస్థాయి అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ వాలంటీర్లకు, మానవత సభ్యులకు, సర్ సిఆర్ కళాశాల విద్యార్థినులకు, ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులకు అందరికీ ప్రసాద్ అభినందనలు తెలిపారు.

ఆరోగ్య పరిరక్షణలో ఆశాల పాత్ర కీలకం

ఆశా డేలో జిల్లా సహాయ మలేరియా అధికారి జె.గోవిందరావు

భీమడోలు : అంటు వ్యాధులను, జ్వరాలను అరికట్టడంలో ఆశా, ఆరోగ్య కార్యకర్తల పాత్ర కీలకమని జిల్లా సహాయ మలేరియా అధికారి జె.గోవిందరావు అన్నారు. గుండుగొలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వేదికగా మంగళవారం ఆశా డే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సహాయ మలేరియా అధికారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశా, ఆరోగ్య కార్యకర్తలు తమ విధుల్లో భాగంగా వివిధ ప్రాంతాలలో పర్యటించినప్పుడు ఆ ప్రాంతపు పరిసరాలను గమనించాలని, అంటువ్యాధులు, జ్వరాలు ప్రబలే అవకాశం ఉంటే ముందస్తుగా గుర్తించి సమాచారాన్ని అధికారుల దృష్టికి తేవాలని కోరారు. ఇదే క్రమంలో వాటి పట్ల స్థానికులను చైతన్య పరచాలని, అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో పిహెచ్‌సి అధికారులు ఇందిరా దేవి, మధుబాబు, శ్రీనివాసరావు, చందు, మురళీ పాల్గొన్నారు.

బాణసంచా తయారీ కేంద్రాల్లో తనిఖీ

నూజివీడు టౌన్ : బాణాసంచా తయారీ కేంద్రాల్లో నూజివీడు టౌన్ సిఐ సత్య శ్రీనివాస్, ఎస్ఐ నాగేశ్వరరావు, సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. మంగళవారం నూజివీడు టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో బాణాసంచా తయారీ, నిల్వ కేంద్రాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ సిఐ సత్య శ్రీనివాస్ మాట్లాడుతూ దీపావళి పండగ సమీపిస్తున్న నేపథ్యంలో కొందరు వ్యక్తులు అనుమతి లేకుండా బాణాసంచా తయారీ, నిల్వ లేదా విక్రయాలు చేపడుతున్నట్లు సమాచారం అందిందని, అందువల్ల ఇలాంటి కేంద్రాలపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. బాణాసంచా తయారీకి సంబంధించిన కేంద్రాలు అధికారుల అనుమతులతో మాత్రమే నడపాలన్నారు. పేలుడు పదార్థాలు నిల్వ చేసేటప్పుడు భద్రతా నిబంధనలను కచ్చితంగా పాటించాలన్నారు. అనుమతులు లేని వారు తయారీ లేదా విక్రయాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నిరుపేదలకు నిత్యావసరాలు అందజేత

ముదినేపల్లి : 'మేము సైతం' ఆపదలో ఉన్నవారికి నేనున్నానంటూ గుడివాడకు చెందిన దాత గూడపాటి భాను ప్రసాద్ తన ఉదారతను చాటుకున్నారు. 'మేము సైతం మీకోసం మేమున్నాం' కార్యక్రమం ద్వారా తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న రెండు నిరుపేద కుటుంబాలకు మంగళవారం నిత్యావసర సరుకులు అందించారు. తన మనవరాలు పాశర్ల మిహిర పేరు మీద నెలనెలా నిత్యావసర సరుకులు అందిస్తున్నారు. ముదినేపల్లిలోని అంబేద్కర్ కాలనీకి చెందిన గోళ్ల మాధవి గత 18 ఏళ్లుగా నడవలేని స్థితిలో ఉండి, ప్రభుత్వ పింఛను కూడా అందని దయనీయ పరిస్థితిలో జీవిస్తుంది. అలాగే బిళ్లపాడు చెందిన నల్లూరు ఈశ్వరి కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతూ చికిత్స కోసం ఇబ్బంది పడుతోంది. ఈ కుటుంబాల దీనస్థితిని 'మేము సైతం మీకోసం మేమున్నాం' బృందం సభ్యులు గూడపాటి భాను ప్రసాద్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో భాను ప్రసాద్ తన మనవరాలు పాశర్ల మిహిర పేరు మీద రెండు కుటుంబాలకు ఆహార పోషణ కోసం ప్రతి నెలా నిత్యావసర సరుకులు అందిస్తున్నారు. కష్టకాలంలో తమకు అండగా నిలిచిన గూడపాటి భాను ప్రసాద్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బృందం సభ్యులు మెడ్డ ఫణీంద్ర, భూపతి రవీంద్ర, సాగర్, పి.ప్రసాద్ పాల్గొన్నారు.

పోరుబాటకు తరలిన యుటిఎఫ్ నేతలు

జీలుగుమిల్లి : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంకోసం కోరుతూ ఫ్యాప్టో ఆధ్వర్యాన మంగళవారం విజయవాడలో నిర్వహించిన ఫ్యాప్టో పోరుబాట ధర్నాకు మండలం నుంచి ఉపాధ్యాయులు తరలి వెళ్లినట్లు యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి అల్లాడి రాజు తెలిపారు. వెళ్లిన వారిలో జిల్లా కార్యదర్శి అల్లాడి రాజు, మండల అధ్యక్షులు రాగాల, మండల కమిటీ సభ్యులు సోమేశ్వరరావు, బి.రామకృష్ణ, రాయి కృష్ణ, కె.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఏలూరు అర్బన్ : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి చేపట్టిన చలో విజయవాడ పోరుబాట కార్యక్రమానికి జిల్లా నుంచి వెయ్యి మంది ఉపాధ్యాయులు, మహిళా ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు తరలి వెళ్లారు. మంగళవారం ఉదయం జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద నుంచి ఉపాధ్యాయులంతా విజయవాడ తరలి వెళ్లారు. ఈ కార్యక్రమానికి ఫ్యాప్టో చైర్మన్ జి.మోహన్, సెక్రటరీ జనరల్ ఎం.ఆదినారాయణ, కో చైర్మన్లు జి.వెంకటేశ్వరరావు, జి.ప్రకాష్, డిప్యూటీ సెక్రటరీ జనరల్ ఆర్.రవికుమార్, శామ్యూల్, బి.రెడ్డి దొర వీరికి నాయకత్వం వహించారు.

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన ఆటల పోటీలు

నూజివీడు టౌన్ : కృష్ణాజిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన బాలుర ఆటల పోటీలు నూజివీడు బాలికోన్నత పాఠశాల ఆధ్వర్యాన ఎస్‌వి థామస్ హై స్కూల్‌లో విజయవంతంగా నిర్వహించడం జరిగిందని పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్‌ఎం దొమ్మ శ్రీనివాసరావు తెలిపారు. రెవరెండ్ బ్రదర్ కిషోర్ కుమార్ పోటీలను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ క్రీడలు పిల్లల శారీరక, మానసిక దృఢత్వానికి దోహద పడతాయని తెలిపారు. కార్యక్రమంలో మండల ఇన్‌ఛార్జ్ స్వప్న, అలీఖాన్, సరళ డివిజన్ ఇన్‌ఛార్జ్ రమేష్, రవీంద్ర, సుకుమార్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

ముగ్గురికి జరిమానా

ప్రజాశక్తి - చింతలపూడి

మద్యం మత్తులో వాహనం నడిపిన ముగ్గురు యువకులకు ఒక్కొక్కరికి రూ.10 వేల జరిమానాను చింతలపూడి జూనియర్ సివిల్ జడ్జి సి.మధు బాబు మంగళవారం విధించారు. చింతలపూడి కోర్టులో విధించారని చింతలపూడి ఎస్‌ఐ కె.సతీష్ కుమార్ తెలిపారు. ఇటీవల మండలంలోని ఎండపల్లి గ్రామంలో వాహనాల తనిఖీ చేస్తుండగా మద్యం మత్తులో ద్విచక్ర వాహనాలపై ముగ్గురు యువకులు ఉండడంతో వారిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు చేసి మంగళవారం చింతలపూడి కోర్టులో హాజరుపరచగా జూనియర్ సివిల్ జడ్జి మధుబాబు ప్రథమ తప్పిదంగా భావించి జరిమానా విధించారు. మరలా మద్యం తాగి వాహనం నడిపితే జరిమానా, జైలు శిక్ష విధిస్తారని న్యాయమూర్తి హెచ్చరించారు.

ఇసుక తరలిస్తున్న ఐదు లారీలు పట్టివేత

జీలుగుమిల్లి : కొవ్వూరు సమీపంలోని ఇసుక ర్యాంపు నుంచి తెలంగాణకు అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఐదు లారీలను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వి.క్రాంతి కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం జీలుగుమిల్లి మండలంలోని పి.రాజవరం సమీపంలో రహదారిపై రెవెన్యూ అధికారులతో కలిసి వాహన తనిఖీలు చేస్తుండగా కొవ్వూరు సమీపంలోని ఇసుక ర్యాంప్ నుంచి 5 లారీలలో సుమారుగా 44 యూనిట్లు ఇసుకను లోడ్ చేసుకొని తెలంగాణ రాష్ట్రానికి వెళ్తుండగా మార్గ మధ్యలో ఆపి తనిఖీ చేయగా సరైన పత్రాలు లేకపోవడంతో లారీలను స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. తహశీల్దార్ ఉదయ్ భాస్కర్ ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ క్రాంతి కుమార్ తెలిపారు.

లభ్యం కాని వృద్ధురాలి ఆచూకీ

విరమించిన గాలింపు చర్యలు

ముదినేపల్లి : పోల్ రాజ్ కెనాల్‌లో గల్లంతైన ముదినేపల్లికి చెందిన వీరంకి విమల(65) వృద్ధురాలు ఆచూకీ ఐదో రోజు కూడా లభ్యం కాలేదు. మంగళవారం కూడా ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందాలు కాలువలో ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టాయి. అమలాపురం నుంచి వచ్చిన ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందం సభ్యులు 11 మంది గాలింపు చర్యల్లో పాల్గొన్నారు. ముదినేపల్లి నుంచి కైకలూరు వరకు కాలువలో గాలించినప్పటికీ వృద్ధురాలు ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో సాయంత్రం వరకు గాలించిన ఆచూకీ తెలియకపోవడంతో ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందాలు గాలింపు చర్యలు విరమించి అమలాపురం వెళ్లిపోయారు. ఐదు రోజులైనా వృద్ధురాలి ఆచూకీ లభించకపోవడంతో అసలు వృద్ధురాలు కాలువలో దిగిందా, లేదా వేరే ఎటైనా వెళ్లిపోయిందా అనే సందేహాలు స్థానికుల్లో వ్యక్తమవుతున్నాయి.

పరిసర ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, అనుమానాస్పద కార్యకలాపాలను అరికట్టే లక్ష్యంతో జంగారెడ్డిగూడెంలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలను జంగారెడ్డిగూడెం డిఎస్‌పి యు.రవిచంద్ర ఆధ్వర్యాన మంగళవారం నిర్వహించారని సిఐ సుభాష్ తెలిపారు. జంగారెడ్డిగూడెం ఇన్‌స్పెక్టర్ ఎంవి.సుభాస్, ఎస్ఐ జబీర్ ప్రత్యేకంగా డాగ్ స్క్వాడ్ సిబ్బంది పాల్గొని ప్రధానంగా జంగారెడ్డిగూడెం బస్ స్టాండ్‌తో పాటు పరిసర ముఖ్య ప్రాంతాలలో ఈ తనిఖీలు చేపట్టారు. ప్రజల రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాలలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు.

'నిర్వాసితులకు న్యాయం చేయాలి'

వేలేరుపాడు : పోలవరం ప్రాజెక్టు కోసం సర్వం త్యాగం చేస్తున్న నిర్వాసితులకు న్యాయం చేయాలని జాతీయ ఎస్‌టి కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్‌కు టిడిపి మండల అధ్యక్షులు అమరవరపు అశోక్ నిర్వాసితులు పడుతున్న కష్టాలను వివరించారు. కెఆర్ పురం ఐటిడిఎ కార్యాలయంలో మంగళవారం జిల్లా సమస్యలపై నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న జాతీయ ఎస్‌టి కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్‌ను నిర్వాసితులతో అమరవరపు అశోక్ కలిసి వారి సమస్యలను వివరించారు. నిర్వాసితుల సమస్యలపై దృష్టి పెట్టి వారిని కూడా పునరావాస కాలనీలు త్వరితగతిన పూర్తిచేసి ఆర్‌అండ్‌ఆర్ పరిహారం నుంచి తరలించాలని కోరారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు కురుమేళ్ల సుధాకర్, చాపర్ల శ్రీను, కోటిపల్లి ముత్యాలరావు, కన్నారావు పాల్గొన్నారు.

పలువురికి స్వచ్ఛాంధ్ర అవార్డుల ప్రదానం

చింతలపూడి : చింతలపూడి ఐసిడిసి ప్రాజెక్ట్‌లోని స్వచ్ఛ ఆంధ్రా అవార్డుకి గాంధీనగర్ అంగన్వాడీ టీచర్ డి.హేమలత ఎంపికయ్యారు. చింతలపూడి సెక్టార్ గాంధీనగర్ అంగన్వాడీ టీచర్‌కు సోమవారం ఏలూరులో కలెక్టర్ వెట్రిసెల్వి, ఐసిడిఎస్ పీడీ చేతుల మీదగా స్వచ్ఛ ఆంధ్రా అవార్డు అందజేశారు. చింతలపూడి ఐసిడిసి ప్రాజెక్టు డైరెక్టర్ సిడిపిఒ టి.సత్యవతి, సెక్టార్ సూపర్‌వైజర్ పి.లీలాకుమారి, కార్యాలయ సిబ్బంది పలువురు డి.హేమలతను అభినందించారు.

జంగారెడ్డిగూడెం : స్వచ్ఛ ఆంధ్ర అవార్డ్స్ 2025లో భాగంగా ఏలూరు జిల్లాలో స్వచ్ఛ మున్సిపాలిటీగా జంగారెడ్డిగూడెం ఎన్నికైన సందర్భంగా సోమవారం ఏలూరులో కలెక్టర్ వెట్రి సెల్వి చేతుల మీదగా ఈ అవార్డు అందుకున్నట్లు మున్సిపల్ కమిషనర్ కెవి.రమణ తెలిపారు. ఇన్‌ఛార్జి సానిటరీ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్‌కి కూడా శానిటరీ విభాగంలో ఈ అవార్డు లభించినట్లు తెలియజేశారు.